ప్రతి పంచాయతి లో ప్రతి రోజు ఉపాధి పనులు జరగాలి

ఉన్నది రెండు నెలలే ..ఉపాధిహామీ పనులపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర-విజయనగరం: ప్రతి గ్రామా పంచాయతి లో ప్రతి రోజు ఉపాధి పనులు తప్పక జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులు, పనిదినాల కల్పనపై ఎం.పి.డి.ఓ లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో తన ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఉన్నది రెండు నెలల గడువేనని , ఈ ఏడాది లక్ష్యాలను పూర్తి చేయక పోతే వచ్చే ఏడాదికి నిధులు రాకపోవచ్చునని, పేద ప్రజలకు నష్టం జరిగితే సహించేది లేదని స్పష్టం చేసారు. అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. . రేపటినుంచి ప్రతీ గ్రామంలో ఉపాధి పనులు జరగాల్సిందేనని, ప్రజలకు విస్తృత స్థాయిలో పని కల్పించాలని, వంద రోజుల పని కల్పన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇకనుంచీ ఈ పనులపై ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా సమీక్షిస్తామని చెప్పారు. క్షేత్ర స్థాయి లో ఖాళీగా నున్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ లను వెంటనే పూరించడానికి అవసరమగు చర్యలు తీసుకోవాలని డ్వామ పి.డి. శారదా దేవికి ఆదేశించారు.

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం భవనాల పనులు వేగవంతం

ఏప్రిల్ నాటికి తొలిదశ నిర్మాణాలు పూర్తి : కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-దత్తిరాజేరు, మెంటాడ : జిల్లాలోని దత్తిరాజేరు, మెంటాడ మండలాల పరిధిలో ఏర్పాటవుతున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం భవన నిర్మాణాల పనులను కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ గురువారం పరిశీలించారు. దత్తిరాజేరు మండలం మరడాం, మెంటాడ మండలం కుంటినవలస గ్రామాల పరిధిలో 560 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం కేటాయించడంతో పాటు ఈ విద్యాసంస్థలో తాగునీటి సరఫరా, విద్యుత్, రోడ్ల నిర్మాణం తదితర మౌళిక వసతులను కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విశ్వవిద్యాలయాన్ని యీ క్యాంపస్ నుంచే నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా విద్యార్థులకు హాస్టల్ భవనాలు, పరిపాలన భవనాలు, అతిథిగృహాల నిర్మాణాన్ని చేపట్టి వేగవంతంగా పనులు జరిపిస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ గిరిజన విశ్వవిద్యాలయ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలసి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పర్యటించి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. బాలుర వసతిగృహం, పరిపాలన భవనం, మెస్, అతిథిగృహం పనులు జరుగుతున్న తీరును పరిశీలించి వాటి పనులు ఏప్రిల్ నాటికి పూర్తయ్యేదీ లేనిదీ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. పరిపాలన భవనాన్ని జి౦2, బాలుర హాస్టల్ భవనాన్ని జి౦7 అంతస్థుల్లో నిర్మిస్తున్నామని కేంద్రీయ విశ్వవిద్యాలయ అధికారులు వివరించారు. 2027 నాటికి అన్ని భవనాలను పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి త్వరగా నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపడతామని, ఈలోగా టెండరు ప్రక్రియ పూర్తిచేసి నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్.ఇ. లక్ష్మణరావును ఆదేశించారు. తాగునీటి సరఫరాలో భాగంగా కుంటినవలస గ్రామం వద్ద గ్రామీణ నీటిసరఫరా విభాగం ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తిచేసిన పంపుహౌస్‌ను పరిశీలించారు. 1.5 కిలోమీటర్ల పైప్‌లైను కూడా వేశామని, 500 మీటర్ల పైప్‌లైను నిర్మాణంలో స్థానిక రైతులు కొందరు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నట్టు ఎస్.ఇ. కవిత కలెక్టర్‌కు తెలిపారు. రైతులతో మాట్లాడి పనులకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని మెంటాడ తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. మరడాం వద్ద వున్న 400 కె.వి.విద్యుత్ కేంద్రం నుంచి మూడు జిల్లాలకు విద్యుత్ పంపిణీ జరగాల్సి వున్నందున గిరిజన విశ్వవిద్యా లయ ప్రాంగణం నుంచి హైటెన్షన్ విద్యుత్ టవర్లు వెళ్లేందుకు అనుమతించాలని, గిరిజన విశ్వవిద్యా లయానికి కేటాయించిన స్థలం నుంచి తమ సంస్థకు పది ఎకరాలు టవర్ల ఏర్పాటుకోసం కేటాయించాలని ట్రాన్స్‌కో అధికారులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. అదే సమయంలో తమ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వున్న విద్యుత్ టవర్లను వెంటనే తొలగించాలని, ఆయా ప్రాంతంలో స్వాగత ద్వారం ఏర్పాటు చేయాల్సి వున్నందున వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని విశ్వవిద్యాలయం అధికారులు కలెక్టర్‌ను కోరారు.

కలెక్టర్ డా బి.ఆర్. అంబేద్కర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఏప్రిల్ నాటికి తొలిదశ పనులు పూర్తిచేసి ఒక బ్లాక్‌ను ప్రారంభించే లక్ష్యంతో పనులు చేస్తున్నారని చెప్పారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ టి.శ్రీనివాసన్ మాట్లాడుతూ తొలి దశ పనులను మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. బాలురు, బాలికల హాస్టల్ భవనాలు, మెస్, పరిపాలన భవనం తదితర పనులను వేగవంతంగా చేపడుతున్నామని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం కల్లా యీ ప్రాంగణానికి విశ్వవిద్యాలయంలో తరగతులు ప్రారంభించాలని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ పర్యటనలో గిరిజన విశ్వవిద్యాలయం ఏ.ఓ. డా.ఎస్.వి.ఎస్.సూర్యనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుప్రియ దాస్, బొబ్బిలి ఆర్.డి.ఓ. రామ్మోహనరావు, ట్రాన్స్‌కో ఎస్.ఇ. బాలాజీ, ప్రాజెక్టుల విభాగం ఎస్.ఇ. నరసింగరావు, విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్.ఇ. లక్ష్మణరావు, గ్రామీణ నీటిసరఫరా ఎస్.ఇ. కవిత తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం ఎం.ఎల్.సి ఎన్నిక కోసం ఈ నెల 29 న షెడ్యూల్ వెలువడినందున ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోనికి వచ్చిందని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు.ఈ ఎన్నిక కోసం విశాఖ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని, విశాఖపట్నం శ్రీకాకుళం, విజయనగరం మన్యం, అనకాపల్లి, ఏ.ఎస్.ఆర్ జిల్లాల డి.ఆర్.ఓ లు సహాయ రిటర్నింగ్ అధికారులుగా ఉంటారని తెలిపారు. ఫిబ్రవరి 3 న విశాఖపట్నం జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని , నామినేషన్ల స్వీకరణకు ఫిబ్రవరి 10 వ తేదీ ఆఖరు తేదీయని, 11న స్క్రూటినీ, 13 న ఉపసంహరణ కు అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరి 27న ఎన్నిక ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు జరుగుతుందని ఓట్ల లెక్కింపు మార్చ్ 3 న ఉంటుందని, మార్చి 8 లోపల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని స్పష్టం చేసారు. ఎన్నికల నిర్వహణ పై గురువారం తహసిల్దార్లు , స్టేషన్ హౌస్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలను జారీ చేసారు. ఎన్నికల కోడ్ సాధారణ ఎన్నికలకు ఉన్నట్లే ఉంటుందని, పొలిటికల్ ప్రతినిధుల అధికారిక కార్యక్రమాలు ఉండకూడదని, శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని, పొలిటికల్ పోస్టర్లు, ఫ్లెక్షి లు తొలగించాలని తెలిపారు. మోడల్ కోడ్ అమలు బృందాలు, ఎఫ్.ఎస్.టి బృందాలు పని చేస్తాయని తెలిపారు. జిల్లాలో 29 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ప్రతి మండలం లో ఒక పోలింగ్ కేంద్రం ఉందని, విజయనగరం లో 3 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, జిల్లాలో 4937 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, వారిలో 3100 మంది పురుషులు కాగా 1837 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు. అదనపు ఎస్.పి సౌమ్యలత మాట్లాడుతూ ఎస్.హెచ్.ఓ లు ఫ్లయింగ్ స్క్వాడ్ గా ఉంటారని, ఒక వీడియో గ్రాఫర్ ను కూడా వారితో పెట్టాలని , ఆర్.డి.ఓ లు, తహసిల్దార్ల తో సమన్వయం చేసుకుంటూ పని చేయాలనీ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జే.సిసేతు మాధవన్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చెయ్యండి

ఎమ్మెల్యే అదితి కి భీశెట్టి వినతి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రి (జి.జి.హెచ్)ఆవరణలో అన్న క్యాంటిన్ ని ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. గురువారం ఆమెను కలిసి జిల్లా పౌరవేదిక బృందం గత నెలలో కేంద్ర ఆసుపత్రిని సందర్శించి తయారు చేసిన ప్రత్యేక నివేదికను ఎమ్మెల్యే కి అందచేశారు. ఈ సందర్భంగా భీశెట్టి విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రోగులకు అనుకున్నంత స్థాయిలో సేవలు అందడం లేదని,ఇరుకు గదుల్లో రోగులు,డాక్టర్లు, సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కేంద్ర ఆసుపత్రిని మెడికల్ కళాశాలకు తరలించి ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో న్యూరో,న్యూరోమెడిసిన్,నెఫ్రాలజీ,యురాలజీ,మెడికల్ అంకాలజీ, కార్డియాలజీలతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్వహించాలని ఎమ్మెల్యే అదితిని కోరామని భీశెట్టి తెలిపారు,సుదూర ప్రాంతాలనుండి వస్తున్న రోగులు,రోగుల బంధువులు సమయానికి మంచి భోజనం దొరక్క ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే అన్నా క్యాంటీన్ ని ఏర్పాటు చెయ్యాలని, రోగుల బంధువులకు విశ్రాంతి భవనం లేదని, రోడ్డు ప్రమాదంలో గాయ పడిన వారికి తక్షణ వైద్యం అందించే ట్రామాకేర్ సెంటర్ లేదని,ప్రతి చిన్న రోగానికీ విశాఖపట్నం వెళ్లిపోం డి అనే మాట డాక్టర్లు చెపుతున్నారని రోగులు ఆరోపిస్తున్నారని, ఒక్కో మంచంపై ఇద్దరూ రోగులు ఉండవలసిన అవసరం కనిపిస్తోందని,ప్రతి రోజు,ఓపి, ఐపీ,పెరిగిపోతోందని, డాక్టర్లు, సిబ్బంది,మౌలిక సదుపాయాల కొరత ఎక్కువగా ఉందని,జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు. ఈ కార్యక్రమంలో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు,ప్రతినిధులు తుమ్మగంటి రాంమోహన్ రావు,త్యాడ ప్రసాద్ పట్నాయక్, ఇప్పలవలస గోపి,తాడేపల్లి నాగేశ్వరరావు తాత్రాజు రాజారావు,తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి, విక్రయం, కొనుగోలు చేసిన వారిని అరెస్టు చేయాలి

నల్ల రిబ్బన్లతో ఏఐఎస్ఎఫ్ , ఏఐవైఎఫ్ నిరసన

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో ఉన్నటువంటి వందేళ్ళ చరిత్ర కలిగిన సిబిఎం గర్ల్స్ స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేసి స్కూల్ గుర్తింపు రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ సిబిఎం స్కూల్ గేట్ ముందు సిపిఐ పార్టీ. రైతు సంక్షేమ సంఘం. అఖిల భారత విద్యార్థి యువజన సంఘాలు అఖిల భారత విద్యార్థి సమైక్య, జిల్లా యువజన సమాఖ్య సంఘాల నాయకులు ఆధ్వర్యంలో సిబిఎం స్కూల్ గేటు ముందు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు .ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మి నాయుడు మాట్లాడుతూ స్కూల్ కరస్పాండెంట్ రత్నకుమార్ తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి బొబ్బిలి పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు తూముల భాస్కర రావు స్థలం కారు చౌక అమ్మడం దుర్మార్గమని. ఇది ముమ్మాటికి పేద మధ్యతరగతి దళిత బాలికల విద్యార్థులకు తీరని అన్యాయమని. దీనిపై స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయన , రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు జరిపి స్కూలును అమ్మిన రత్న కుమార్ కొనుగోలు చేసిన తూముల భాస్కర్ రావు పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సిబిఎం స్కూల్ స్థలము అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేసి పేద పిల్లలకు న్యాయం చేయాలని గత నాలుగు నెలలుగా భారత కమ్యూనిస్ట్ పార్టీ, ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని.....? ఈ సందర్భంగా ప్రశ్నించారు. పేద విద్యార్థులకు అన్యాయం జరిగితే భవిష్యత్తులో ఉద్యమాలను ఉద్రిక్తం చేస్తామని అందుకు సంబంధించి శాఖ అధికారులు భాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్. సిపిఐ నాయకులు పాలూరి కృష్ణ ఏఐఎస్ఎఫ్ బొబ్బిలి డివిజన్ కార్యదర్శి వి శ్రావణ్ కుమార్. ఏఐవైఎఫ్ పట్టణ నాయకులు బి గణేష్ సిపిఐ సభ్యులు కే సంజీవ్. కె రవి పాల్గొన్నారు.

జగన్ చేసిన అప్పులే రాష్ట్రానికి ముప్పు

ఎమ్మెల్యే అదితి గజపతి రాజు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: జగన్ చేసిన అప్పులే రాష్ట్రానికి ముప్పు అని శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో మాట్లాడుతూ గత అయిదేళ్ల జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసిపి పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించారని విమర్శించారు. గడచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్మెంట్ లాంటి జగన్ ప్రభుత్వం చేసిన బకాయిలు రూ. 22 వేల కోట్లను చంద్రబాబు నాయుడి గారి నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం చెల్లించిందని, అప్పులు కూడా పుట్టని స్థితి ఏర్పడిందని అన్నారు. ఏడాదికి రూ. 71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాలి, ఇవి రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండలా మారాయని అన్నారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి, చేసిన అప్పులతో జగన్ విలాసాలు, దుబారా ఖర్చులు చేశారు. కానీ రాష్ట్రాభివృద్ధికి వినియోగించలేదని అన్నారు. ఇన్ని అప్పులు చేసినా ఇంకా అనేక వ్యవస్థలలో బకాయిలు పెట్టారని తెలిపారు. ఈ విధంగా జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయి రూ. 1.40 లక్షల కోట్లు ఉన్నాయని, ఈ స్థాయిలో గతంలో ఏ ప్రభుత్వం బకాయిలు పెట్టలేదని అన్నారు. జగన్ తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలు, జల్సాలకు ఖర్చు చేసి తినేశారని అన్నారు. వీటితోపాటు అయిదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతు లు.. ఇలా ప్రతి దాంట్లో ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారు. ఆంధ్రప్రదేశ్ గుండెకాయ లాంటి సచివాలయాన్ని కూడా తాకట్టుపెట్టాడు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యంలో చేతివాటం చూపారు. చివరికి చిన్నారుల పోషణకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు వంటి వాటిల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడు. ఈ విధమైన జగన్ రెడ్డి అరాచక పాలనా వలన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ దివాళా తీయడం వలన, నేటి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండగా తయారై ప్రజలపాలిట శాపంగా మారిందని విమర్శించారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు ఏది?

మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య

విశాలాంధ్ర-గజపతినగరం : కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు గడిచిన సందర్భంగా అభివృద్ధి శూన్యం అని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. గజపతినగరం వైసీపీ పార్టీ కార్యాలయంలో గురువారం అప్పల నరసయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని వేల కోట్ల రూపాయలు అప్పుచేసి రాష్ట్ర అభివృద్ధికి గాలికి వదిలారని ఈ తొమ్మిది నెలల్లో ప్రజలకు చేసింది ఏమీ లేదని సంపద సృష్టించాం అని ఈ పెద్ద మనుషులు పెన్షన్లు మాత్రమే పెంచారని గత 5 ఏళ్ల వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి పెట్టుబడులు తెచ్చి ప్రజలకు అన్ని సౌకర్యాలు ఇచ్చారని మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు సంపాదన సృష్టించి ప్రజలకు ఏం చేశారు అన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి జగన్మోహన్ రెడ్డి చాలామందికి ఉపాధి ఆదాయం వనరులు కల్పించారని. రెండు లక్షల సచివాలయ ఉద్యోగులను తీసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు ఈరోజు పరిపాలన చంద్రబాబు కాదు.. చంద్రముఖి పాలన అని అన్నారు. బిజెపి జనసేన టిడిపి కూటమిలో పవన్ గాని బిజెపి వారు గాని ఏమీ మాట్లాడడం లేదన్నారు ప్రజలకు ఎవరు జవాబు దారి అని నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా ఉండగా ఉద్యోగాలు తెప్పించారు అని అన్నారు. అలాగే వాలంటీర్ వేస్తాను తీసుకొచ్చి లక్ష ఉద్యోగాలు కల్పించారని అన్నారు. కోటమే ప్రభుత్వం ప్రజలకు మోసం చేసిందని హామీలు నెరవేర్చలేదని చంద్రబాబు వారి సామాజిక వర్గానికి కుమ్ము కాస్తు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తౌడు. మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు. నాయకులు బెల్లాన త్రినాధరావు. చలుమూరు మూర్తి. గేదెల జగదీష్. కరణం ఆదినారాయణ. మండల సురేష్. రేగ సురేష్. కర్రి రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు విజయనగరం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మహా కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనుందని ఆర్టీసీ డిఎం శ్రీనివాసరావు గురువారం తెలిపారు. వచ్చేనెలఫిబ్రవరి 7వ తేదీన సాయంత్రం 6.00 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు వయా భువనేశ్వర్, కోణార్క్, పూరి,ప్రయాగ రాజ్, వారణాసి మీదుగా అయోధ్యకు వెళ్ళి తిరిగి 13 వ తేదీన రాత్రి విజయనగరం చేరుకుంటాయని తెలిపారు.మహా కుంభ మేళా ప్రత్యేక బస్సును ఆన్ లైన్ ద్వారా గాని లేదా బస్టాండ్ యందు రిజర్వేషన్ కౌంటర్ ద్వారా టికెట్ సౌకర్యం పొందవచ్చు అన్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం తో పాటుగా రాను పోను టికెట్ ధర. 10,500/- లు మాత్రమే కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు మరిన్ని వివరాలకు. 99592 25620 94943 31213 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

సమగ్ర శిక్ష ఏ.పి.సి.గా బాధ్యతలు చేపట్టిన డా.ఏ. రామారావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులుగా డా. ఏ.రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఏ.పి.సి. గా బాధ్యతలు చేపట్టిన డా.రామారావు కు జిల్లా విద్యా శాఖ అధికారి మాణిక్యం నాయుడు, విద్యా శాఖ సిబ్బంది అభినందనలు తెలిపారు. డా రామారావు ఇప్పటి వరకు పార్వతీపురం లోని ఉద్యాన కళాశాల లో అసిస్టెంట్ ప్రొఫెసరు గా చేస్తూ ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

ఆవు దూడలు, సన్న జీవాలకు నట్టల మందుల పంపిణీ

పశు వైద్యాధికారిని సిహెచ్ హైమావతి

విశాలాంధ్ర-మెరకముడిదాం: శ్యామయవలస మరియు భీమవరం గ్రామాలల్లో గురువారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు మండల పశు వైద్యధికారిణి హైమావతి తెలిపారు.ఈ పశు ఆరోగ్య శిబిరాల్లో శ్యామయవలస, భీమవరం గ్రామాల్లో 1082 పశువులు మరియు దూడలకు నట్టల మందులు పట్టడం జరిగింది. 2708 సన్న జీవాలకు నట్టల మందులు పట్టడం జరిగింది. 62 పశువులకు గాను చూడి పరీక్షలు నిర్వహించటం జరిగింది.92 పశువులకు గాను ఎదకు రాని, చూలు కట్టని మరియు గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగు వైద్యం అందించటం జరిగిందని ఆమె తెలిపారు.600 సన్నజీవాలకు గాను షీప్ పాక్స్ మరియు గోట్ ఫాక్స్ టీకాలు వేయటం జరిగింది.800 కోళ్లకు పౌల్ పాక్స్ టీకాలు వేశామని మరియు పశుపోషకులకు పశు పోషణలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించినట్లు మండల పశు వైద్యధికారిణి సిహెచ్ హైమావతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,రైతులు మరియు మండల పశు వైద్య సిబ్బంది అందరూ పాల్గున్నారు.

ముకుందపురం లో పశువైద్య శిబిరం

విశాలాంధ్ర-సంతకవిటి/రాజాం: సంతకవిటి మండలం ముకుందపురంలో గురువారం పశువైద్య శిభిరం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అలాగే పశు సంవర్ధక శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశువైద్య శిబిరాలలో భాగంగా ఈరోజు ముకుందపురం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ కుమార్, మోదుగులపేట వెటర్నరీ అసిస్టెంట్ గురుగుబెల్లి కిరణ్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరాన్ని సచివాలయ పరిధిలో ఉన్న గ్రామస్తులు అందరూ మంచిగా వినియోగించుకున్నారనీ, పశువులకు నిత్యం వచ్చే అన్ని రకాల వ్యాధులపై రైతులు అడిగి మరీ తెలుసుకొన్నారన్నారు. శిబిరంలో నట్టల నివారణ, శూలు నిర్ధారణ పరీక్షలు, గర్భకోస వ్యాధుల చికిత్సలు మొదలైన వ్యాధులకు చికిత్సలు అందించారు. అలాగే గొర్రెలకు, మేకలకు పరీక్షలు చేసి లీవర్ టానిక్ మరియు డి వార్మింగ్ మందులు అందించడం జరిగిందన్నారు. అంతే కాకుండా గతంలో మరణించిన పశువలకు ప్రభుత్వ భీమా ద్వారా నష్టపరిహారం అందించడంలో సహకరించిన వెటర్నరీ డిపార్ట్మెంట్ అధికారులకు సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ కిరణ్ కుమార్ కు స్థానిక రైతులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆహా రమణ,స్వాతి,సంజయ్యా ,వెంకటేష్, మురళి, గ్రామం లో పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనలో ముందుండాలి

విశాలాంధ్ర-జామి: ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యసాధనలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి, పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డా. జీవనరాణి సూచించారు. గురువారం మండల కేంద్రమైన జామిలోని పిహెచ్‌సీని అకస్మికంగా తనిఖీ చేసారు. ఆసుపత్రిలో సేవలపై ఆరాతీసారు. ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ పట్ల వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలో ప్రసవాలు, రోగులకు అందుతున్న సేవలను నేరుగా తెలుసుకున్నారు. ఈపరిశీలనలో పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టి.బి వ్యాధి నిర్మూలనకు సహకరించాలి

విశాలాంధ్ర-రామభద్రపురం: టి.బి వ్యాధి నిర్మూలనకు అందరూసహకరించాలని స్టేట్ టిపిఎం కోఆర్డినేటర్ ఎస్. అరుణ కుమారి కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వంద రోజులు టి.బి నివారణ అవగాహన కార్యక్రమంలో ప్రచార వాహనం పోస్టర్లను ఆవిష్కరణల భాగంగా ఆమె మాట్లాడుతూ టి.బి వ్యాధి అంటువ్యాధి వంటిదని, రెండు వారాలు మించి దగ్గు ఛాతిలో నొప్పి జ్వరం లక్షణాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ప్రచార వాహనం ద్వారా అవగాహన కల్పించి ఎవరైనా టి.బివ్యాధిగ్రస్తులు ఉన్నట్లయితే తమ సిబ్బంది ద్వారా పరీక్షలు జరిపి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. టి.బి వ్యాధికి వ్యతిరేకమైన పోషక ఆహారం అదే బలమైన ఆయుధం. టి.బివ్యాధిని దాచకూడదు ఓడించాలని వాళ్ళు నినాదాలు చేశారు పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ ఆర్. శ్రీదేవి తాసిల్దార్ ఆకులసులోచన రాణి, ఎంపీడీవో రత్నం, సిసి బాలకృష్ణ , జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీతం కళాశాల ఆధ్వర్యంలో కిక్ బాక్సింగ్ పురుషుల జట్టు ఎంపిక

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజ నీరింగ్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన జేఎన్టీయూ గురజాడ విజయనగరం యూనివర్సిటీకి చెందిన పురుషులకు కిక్ బాక్సింగ్ జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి తెలిపారు. ఈ పోటీల్లో సుమారు 70 నుంచి 80 మంది క్రీడాకారులు లోకిక్, పాయింట్ గేమ్ లో వివిధ వెయిట్ క్యాటగిరి లో పాల్గొన్నారు. చివరగా ఈ పోటీల లో ఏడుగురు క్రీడాకారులు వివిధ కళాశాల నుండి అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు పంజాబ్ లోని గురుకాశి యూనివర్సిటీలో ఫిబ్రవరి 11 నుంచి 18 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయి, జాతీయస్థాయి క్రీడాపోటీలు ప్రతి సంవత్సరం తరచుగా నిర్వహిస్తామని ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పై స్థాయికి చేరి కళాశాలకు, జేఎన్టీయూ గురజాడ విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు యూనివర్సిటీ సెలక్షన్ కమిటీ పరిశీలకుడుగా రఘు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన సూర్యనారాయణ రాజు, నేషనల్ రిఫరీ సుమన్, నేషనల్ కోచ్ లు ప్రవీణ్, నూకరాజు బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేశ్వర రావు, శ్రీదేవి, సి.ఎస్.ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: అహింస సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అందించిన గొప్ప మహనీయుడు మహాత్మా గాంధీ అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి రోజున అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన స్వతంత్ర సమరయోధుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు.

మా గ్రామంలో కుల వివక్షత : బూరాడ గ్రామ దళితులు

విశాలాంధ్ర-రేగిడి/రాజాం: విజయనగరం జిల్లా రేగిడి మండలం బూరాడ గ్రామ ఎస్సీ కాలనీలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శాసపు రేవతి ఆధ్వర్యంలో నిర్వ హించిన సమావేశంలో గ్రామంలో ఉన్న దళిత మహిళలు ఎదుర్కొంటున్న వివక్షతను గ్రామంలో ఎస్సీ ఎస్టీలకు సంబంధించి ఉపాధి హామీ పనుల వద్ద బీసీలు వివక్షతను చూపిస్తున్నారని దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు, కార్యక్రమం లో రేగిడి మండల దళిత జేఏసీ అధ్యక్షులు తేగల మోహన్ మాట్లాడుతూ బూరాడ గ్రామంలో చాలా ఏళ్లుగా దళితులకు సంబంధించి శ్మశాన వాటిక స్థలం లేక ఇబ్బంది పడుతున్నారని అనేకసార్లు కలెక్టర్ కి ఎమ్మార్వో కి విన్నవించిన ఫలితం లేదని తెలిపారు. కార్యక్రమంలో బూరాడ గ్రామ వీఆర్ఓ, మహిళలు పాల్గొన్నారు.

రామలింగాపురంలో జంతు సంక్షేమ ర్యాలీ



విశాలాంధ్ర-చీపురుపల్లి : ఉచిత పశు వైద్య శిబిరాల నిర్వహణలో భాగంగా గురువారం నాడు చీపురుపల్లి మండలం రామలింగాపురం గ్రామంలో పశు వైద్యాధికారుల పర్యవేక్షణలో పాఠశాల విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు. చీపురుపల్లి పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ శారద పర్యవేక్షణలో జంతు సంక్షేమ పక్షోత్సవాలు భాగంగా పాఠశాల విద్యార్థులతో ప్లే కార్డ్స్ లు పట్టుకుని రాలి నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు గొర్ల పద్మ , మిరియాల అప్పారావు, పశు వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో జంతు సంక్షేమం పైన విద్యార్థులకు అవగాహన కల్పించి పాఠశాలలు 7,8, తరగతిలో చదువుతున్న విద్యార్థులకు వకృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలు గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ శారద చేతుల మీదుగా అందజేశారు. అంతరం గ్రామంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో సుమారు 600 పశువులకు ఉచితంగా చికిత్సలు నిర్వహించి నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది ఎల్ వాసుదేవరావు, పాఠశాల సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ను క్రమబద్ధీకరించి గ్రాట్యూటీ అమలు చేయాలి



విశాలాంధ్ర-భోగాపురం : ఐసిడిఎస్ ను క్రమబద్ధీకరించి గ్రాట్యూటీ అమలు చేయా లని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గురువారం అంగన్వాడి కార్యకర్తలంతా వ్యక్తిగత దరఖాస్తులను ప్రదర్శించారు. ఈ దరఖాస్తులను పోస్టల్ ద్వారా రాష్ట్రపతికి పంపిస్తున్నట్లు యూనియన్ నాయకులకు తెలిపారు. యూనియన్ నాయకులు ఎం కొర్లమ్మ, అనిత, దేవి పాల్గొన్నారు.

విశాలాంధ్ర - విజయనగరం
పేజి : 2
శుక్రవారం 31, జనవరి 2025

చెరువులో జారిపడి యువకుడు మృతి

విశాలాంధ్ర-భోగాపురం: చెరువులో ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు మృతి చెందిన సంఘటన భోగాపురం గ్రామంలో చోటుచేసుకుంది. దీనిపై పోలీసులు అందించిన వివరాల ప్రకారం. భోగాపురం గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటేష్(22) ఈనెల 23వ తేదీ నుంచి కనబడలేదు. దీంతో తల్లిదండ్రులు కుమారుడు కోసం వెతుకు తున్నారు. గ్రామంలోని ముక్కాం వెళ్లే జంక్షన్ లో ఉన్న గంగరాలు చెరువులో మృతదేహం తేలి ఉందని కొంతమంది స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సమాచారం అందుకున్న వెంకటేష్ తల్లిదండ్రులు మృతదేహాన్ని పరిశీలించి ఇది తమ కుమారుడిదేనని గుర్తించారు. దీనిపై తండ్రి పసుపులేటి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎస్ వి ప్రభాకర్ తెలిపారు.

3వ రోజు కొనసాగిన ధర్నా

ధర్నాకు మద్దతు తెలిపిన వైసిపి, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని ఆతవ రహదారి నిర్మించాలని 3వ రోజు బుధవారం గ్రామస్తులు ధర్నా చేపట్టారు. సోంపురం ఆనందపురం ఆర్ అండ్ బి రహదారికి ఆనుకొని ఆతవ జంక్షన్లో గ్రామస్తులు చేపట్టిన ఈ ధర్నాకు మద్దతుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డి సి సి బి మాజీ చైర్మన్ వేచలపు వెంకట చినరామనాయుడు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, మండల పార్టీ అధ్యక్షుడు ముమ్ములూరి జగన్నాథం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, పాటు పార్టీ నాయకులు, సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్,మండల మాల మహానాడు అధ్యక్షుడు దేభార్క్ కిరణ్,పలు ప్రజా సంఘాల నాయకులు తదితరులు తమ మద్దతు ప్రకటించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ధర్నా మద్దతు పలికారు. అలాగే బహుజన ఉద్యమకారుడు గ్రామానికి చెందిన ఆతవ ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు యువకులు గ్రామస్తులు పాల్గొని నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా డిసిసిబి మాజీ చైర్మన్ మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ నాయకులు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి

హామీలు మరిచిపోవడం దారుణం అన్నారు. ఆతవకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడడం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అధికారంలోకి రాగానే మర్చిపోతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఏళ్ల తరబడి రాళ్లు తేలి రాకపోకలకు కనీస సౌకర్యం లేని రహదారిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.ఆతవ రోడ్డు పనులు తక్షణమే చేపట్టే వరకు ధర్నా విరమించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సేనాపతి అప్పారావు, వైసీపీ నాయకులు బోజంకి రామానాయుడు, అరిగి పాలెం ఎంపీటీసీ తొండవరపు వెంకటరమణ ద్వారపూడి గంగు నాయుడు,గ్రామ సర్పంచ్ గొంప వేమన రాము,దళిత నాయకులు కెర్రి దేముడు, మాజీ సర్పంచ్ బోని నాగరాజు, దప్పు అప్పలరాజు, చప్ప నూకరాజు గ్రామం మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపైనా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది వివిధ పోలీసు స్టేషను పరిధిలో విజిబుల్ పోలీసింగు నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది ముఖ్య కూడళ్ళులో వాహన తనిఖీలు నిర్వహించి, మద్యం సేవించిన వారిపై డి.డి. కేసులు నమోదు చేసారు. అదే విధంగా బహిరంగ ప్రదేశాల్లోను, లే-అవుట్స్ లోను మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై దాడులు నిర్వహించి, వారిపె కేసులు నమోదు చేసారు. వాహన తనిఖీల్లో ఒక్క రోజునే ఎం.వి.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 455 ఈ-చలానాలను విధించినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. 2024 సం.లో మద్యం సేవించి వాహనాలను నడిపిన వారిపై 5,853 డిడి కేసులు నమోదు చేయగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై 13,135 కేసులు నమోదు చేసామన్నారు. అదే విధంగా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారిపై 60,392 కేసులు, మైనరు డ్రైవింగుపై 2,747 కేసులు, సెల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడిపిన వారిపై 1,329 కేసులు, డ్రైవింగు లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన వారిపై 1,437 కేసులు, నంబరు ప్లేట్స్ సక్రమంగా లేని వాహనదారులపై 3,248 కేసులు నమోదు చేసినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు పోలీసు అధికారులు, సిబ్బంది భద్రత ప్రమాణాలు, హెల్మెట్ ధారణ వలన కలిగే ఉపయోగాలను వివరించారు. మైనర్లకు, మద్యం సేవించి వాహనాలను నడుపుతూ పట్టుబడిని వారికి సంబంధిత పోలీసు అధికారులు కౌన్సిలింగు నిర్వహించి, రహదారి ప్రమాదాలకు కారకులు కావద్దని, ప్రమాదాలకు గురవ్వద్దని, తమపై ఆధారపడి జీవించే భార్య, పిల్లలు, ఇతరకుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలని, ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్స్ ధరించాలని కౌన్సిలింగు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఏఎస్ ఐ గా భాస్కర్ రావు బాధ్యతలు

విశాలాంధ్ర-మెంటాడ: నూతనంగా ఆంధ్ర పోలీస్ స్టేషన్ కు ఏఎస్ఐగా భాస్కరరావు బాధ్యతలు చేపట్టారు. ఆయన బొబ్బిలి పోలీస్ స్టేషన్ నుంచి ఆంధ్ర బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఇదే స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహించానని ఇక్కడ వారందరూ సుపరిచితులని అందరితో స్నేహపూర్వకంగా ఉండి చట్టపరంగా విధులు నిర్వహిస్తానని అన్నారు. సాధ్యమైనంత వరకు ప్రజలతో మమేకమై చట్టాలపై అవగాహన కల్పిస్తానని తెలియజేశారు.

జిసిఎస్ఆర్ కళాశాలలో శిక్షణా తరగతి

విశాలాంధ్ర-రాజాం: రాజాం జిసిఎస్ఆర్ కళాశాలలో బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రు ఎడ్యుకేషన్(బిసిడిఇ), శిక్షణా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం నాలుగవ సెమిస్టర్ విద్యార్థులకు "లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం"(ఎల్ ఐ పి) పైన ఓరియంటేషన్ ప్రోగ్రాం ఇవ్వడం జరిగింది.విద్యార్థులు షార్ట్ టర్మ్ ఇంటర్న్ షిప్ లో భాగంగా ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యలో వెనుకబడిన విద్యార్థులకు పాఠాలు నేర్పడం ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.పురుషోత్తంరావు, బీ సీ డీ ఈ సమన్వయకర్త అజయ్ కుమార్, అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ సెక్షన్ ఆఫ్ ఫౌండేషన్ మేనేజర్ అప్పారావు కళాశాల బీ సీ డీ ఈ సమన్వయకర్త సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహాత్మునికి ఘన నివాళి

విశాలాంధ్ర/రాజాం: మహాత్మా గాంధీకి మానవత సభ్యులు ఘన నివాళి అర్పించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి,మౌనం పాటించారు, ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ పి.నాగయ్య మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్వాతంత్రం కోసం ఆయన చేసిన పోరాట ఫలితమే స్వేచ్ఛా జీవితాన్ని పొందుతున్నామని అన్నారు. ఆయన అడుగుజాడల్లో, శాంతి మార్గాన్ని ఎంచుకొని ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్ , అధ్యక్ష కార్యదర్శులు టీవీ అచ్యుత్ కుమార్, ఉల్లాకుల నీలకంటేశ్వర్ యాదవ్, సలహాదారులు మక్కా అప్పలనాయుడు, శాసపు సత్యనారాయణ, పిడుగు సూర్యారావు, బివర.శంకర్రావు ఉపాధ్యక్షులు గట్టి.పాపారావు, కోశాధికారి దామెర.సీతా రమేష్, మానవత సభ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

పీహెచ్‌సీ డా. అనిల్ కుమార్

విశాలాంధ్ర-లక్కవరపుకోట: కుష్టు వ్యాధిపై మండలంలోని అన్ని గ్రామాలలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిచే అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎల్ కోట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి అనిల్ కుమార్ తెలిపారు. గురువారం ఆసుపత్రి ఆవరణలో తన సిబ్బందితో ప్రతిజ్ఞ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిసి అవగాహన పెంచుదాం, అపోహలను దూరం చేద్దాం, కుష్టు వ్యాధి బారిన పడిన ఎవరు వెనుక పడకుండా చూసుకుందాం అన్నారు. కుష్టి వ్యాధి లక్షణాలు చర్మంపై స్పర్శ లేని మచ్చలు, కాళ్ళ చెప్పులు జారిపోవడం, తెలియకుండా చేతులు, కాళ్లు బొబ్బ రావడం, చల్లని, వేడి వస్తువులు గుర్తించకపోవడం, కనురెప్పలు మూతపడక పోవడం వంటి తదితర లక్షణాలు కనిపించినచో వెంటనే ఆరోగ్య సిబ్బందికి తెలియజేసి దగ్గరలో గల ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు తమ సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు కనుక వారు అడిగిన సమాచారం తెలియపరచవలసిందిగా కోరారు కుష్టు వ్యాధి ఉన్నవారు కి తమ సిబ్బంది ఎం డి టి మందులు ఉచితముగా పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి

విశాలాంధ్ర-గుర్ల: కోటగండ్రేడు గ్రామంలో ముద్దాడ దినేష్ రైస్ మిల్లులో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రం ఖగారియా జిల్లా మనీష్ తానా, బోయారు గ్రామానికి చెందిన పులేషణ కుమార్(27), రిషిదేవి కులం అని అతను తన కుటుంబ సమస్యల కారణంగా రైస్ మిల్లు దగ్గరలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ను పట్టుకుని విద్యుత్ షాక్కు గురయ్యాడు. వెంటనే విజయనగరం గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించగా మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఎస్ఐ పి. నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై డిటిఓ సానుకూల స్పందన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా ఖజానా, లెక్కల శాఖ అధికారి ఆర్ ఏ ఎస్ కుమార్ ను ఔట్సోర్సింగ్ ఎంప్లాయిన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గండిపిల్లి మహేంద్ర బాబు ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పట్ల డి టి ఓ సానుకూలంగా స్పందించారు . ఈ సందర్భంగా ఉద్యోగులకు క్యాలెండర్ ని ఆవిష్కరించారు. ఖజానా శాఖ ద్వారా త్వరితగతిన ఉద్యోగుల బిల్స్ చేయడంలో ఎప్పటికప్పుడు నూతన విధివిధానాలపై ఖజానా శాఖ వారి మార్గదర్శకాలు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖజానా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మనాభం, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గండిపిల్లి మహేంద్ర బాబు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్గనైజింగ్ సెక్రటరీ బి కిషోర్, సుబ్బు అశోక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతిపితకు స్థానిక గురజాడ విద్యార్థులు ఘన నివాళి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక గురజాడ విద్యార్థులతో గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా 300 మంది విద్యార్థులతో రఘుపతి రాఘవ రాజారాం గీతాలాపనతో గురజాడ పాఠశాల నుంచి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ రైతు బజార్ మీదుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎం వి ఆర్ కృష్ణాజి, కరస్పాండెంట్ ఎం స్వరూప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.కోట సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేసిన న్యాయ సేవా సంస్థ కార్యదర్శి టీ.వీ రాజేష్ కుమార్

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: విజయనగరం జిల్లా జడ్జి బి సాయి కళ్యాణ చక్రవర్తి గారి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి టీ.వీ రాజేష్ కుమార్ గురువారం శృంగవరపుకోట ఉపకారాగారమును మరియు ఉపకార గారంలో కొనసాగుతున్న జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా సిబ్బంది నిర్వహించే విధులు ,ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత మరియు ఖైదీలకు అందజేయాల్సిన ఉచిత న్యాయ సేవలు అంశాలను గురించి ఆరా తీశారు. జైలేగలేడి క్లినిక్స్ నిర్వహిస్తున్న విధులను పర్యవేక్షించారు. న్యాయవాదులు మరియు పేరా లీగల్ వాలంటీర్లను నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వం తరఫున ఉచితంగా న్యాయవాదిని నియమించడం జరుగుతుందని దీనికి సంబంధించిన వివరాలను సబ్జైల్ సూపర్నెంట్ ద్వారా గాని లేదా జైలు సందర్శక న్యాయవాదికి గాని ఒక దరఖాస్తును అందజేయడం ద్వారా ఖైదీలకు ఉచితంగా న్యాయవాదులను నియమించడం జరుగుతుందని తెలిపారు.

వైసీపీ నియోజకవర్గ అంగన్‌వాడీ అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి

నియామక ఉత్తర్వులు జారీ చేసిన వైసీపీ అధిష్టానం

విశాలాంధ్ర-జామి: వైసీపీ నుంచి అంగన్‌వాడీ అసోషియేషన్‌కు గజపతి నగరం నియోజకవర్గం అధ్యక్షురాలిగా భీమసింగి సర్పంచ్‌గా ఉన్న జొన్నాడ వెంకటలక్ష్మిని పార్టీ అధిష్టానం నియమించింది. ఈమేరకు వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. భీమసింగి సర్పంచ్‌గా ఉన్న జొన్నాడ వెంకటలక్ష్మి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గతెన్నికలలో సైతం ఆమె తీవ్ర స్థాయిలో ప్రచారం చేసి ముఖ్యనేతల మన్ననలు పొందారు. వెంకటలక్ష్మిని నియోజకవర్గ అంగన్‌వాడీ అధ్యక్షురాలిగా నియమించడం పట్ల మండలంలోని వైసీపీ నేతలు హర్షం వ్యక్తం చేసారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహనా ఉండాలి

సదస్సులో ఎంపిడివో నీలం అప్పలనాయుడు

విశాలాంధ్ర-జామి: సమాచారహక్కు చట్టం 2005పై ప్రతీ ఒక్కరికీ పూర్తి స్థాయి అవగాహన కలిగి వుండాలని ఎంపిడివో నీలం అప్పలనాయుడు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు, వివిధ ప్రజాప్రతినిధులకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో విజయనగరంకు చెందిన చదలవాడ ప్రసాదరావు, ఎస్‌కోటకు చెంది దొడ్డిసూర్యారావు, జామికి చెందిన న్యాయవాది బివి.రమణారావు తదితరులు చట్టం అంటే ఏమిటి..? దీని వలన కలిగే లాభాలను, నష్టాలను వివరించారు. అలాగే పలు సెక్షన్‌లను వివరించారు. మండల వైసీపీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈకార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు వర్మరాజు, దేగల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 13న డిల్లీలో అంగన్వాడీ ల ధర్నా

విశాలాంధ్ర-వంగర : ఫిబ్రవరి 13 డిల్లీలో న జరగనున్న అంగన్వాడీ వర్కర్ల సమ్మె జరప నున్నట్లు అంగన్వాడీ వర్కర్లు మండల లీడర్లు పి.భారతి, యస్.కుమారి తెలిపారు. ఈ ధర్నాఅనంతరం తాము రాష్ట్ర పతి ద్రౌపదీ ముర్మును కలసి తమకు ఉద్యోగ క్రమ బద్ధికరణ చెయ్యాలని,7 వ పే కమిషన్ సిఫార్సు కనుగుణంగా కనీస వేతనం రూ.26000 లకు పెంచే టట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోనే టట్లు మెమోరండాన్ని అంద జేయ నున్నట్లు బుధవారం నాడు మండలంలో మెట్ట మగ్గూరు అంగన్వాడీ సెంటర్లో జరిపిన అంగన్వాడీ కార్యకర్తల సమావేశం పేర్కొన్నారు.అంగన్వాడీ గుజరాత్ హై కోర్టు,సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం అంగన్వాడీ కార్యకర్తలు,హెల్పర్లకు రెగ్యులై రేషన్ బకాయిలు,వడ్డీతో సహా చెల్లించాలని తదితర అంశాల పై రాష్ట్రపతికి మెమొరాండంలో పేర్కొని అందజేయనున్నట్లు ఈ సమావేశంలో పేర్కొన్నారు.ఈ సమావేశంలో వివిధ గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు,హెల్పర్లు పాల్గొన్నారు.

దేశాన్ని మంచిమార్గంలో నడిపేందుకు యువత ముందుకు రావాలి

జనసేన నేత గురాన అయ్యులు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: దేశంలో అవినీతి, అశాంతి ఎక్కువయ్యాయని, దేశాన్ని మంచిమార్గంలో నడిపేందుకు యువత ముందుకు రావాలని జనసేన నేత గురాన అయ్యులు అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గంలో ప్రజలంతా నడవాలని, శాంతి సమాధానాలు కలిగి తోటి వారికి సాయపడే విధంగా పనిచేయాలని అన్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల్లో మహాత్మాగాంధీ సూచించిన శాంతి సందేశం దేశానికి ఎంతో అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పి. రవీంద్ర , నాగులపల్లి ప్రసాద్ , సిరిపురపు దేవుడు, ఎంటి రాజేష్, పి.అభిలాష్, ఎమ్.పవన్ కుమార్, పృథ్వీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ కి ఘన నివాళి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో గురువారం అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ నడకమైదానంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా కోఆర్డినేటర్, శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు మాష్టారు, ఎలక్ట్ గవర్నర్ ఎ. తిరుపతి రావు మాట్లాడుతూ అహింసే ఆయుధంగా మలుచుకొని ఏదైనా సాధించవచ్చని నిరూపించిన మహనీయుడు మహాత్మా గాంధీ అనికొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు,ఉపాధ్యక్షులు వల్లూరి శ్రీనివాసరావు, క్లబ్ కోశాధికారి ఆర్.సి.హెచ్. అప్పలనాయుడు,క్లబ్ సభ్యులు పైడియ్య, కోట్ల సత్యనారాయణ,పి.అప్పలరాజు, టి. రమణ, జి. గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రం గా కానరాని పశు వైద్య శిబిరాలు : ఎంపీపీ

విశాలాంధ్ర-వంగర: రాష్ట్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పశు వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు ఎటువంటి వ్యాధులుప్రబల కుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలున్నప్పటికీ ఇక్కడ సంబంధిత అధికారులు" తూతూమంత్రంగా చేస్తున్నారని, సక్రమంగా చేపట్టటం కానీ, పట్టించుకోవటం లేదని ఎంపీపీ సురేష్ ముఖర్జీ అధికారుల పై మండిపడ్డారు. గురువారం ఆయన మండల పరిషత్ తన ఛాంబర్లో విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు.గ్రామాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఆయా గ్రామాలు రైతులకు గానీ,ప్రజాప్రతినిధులకు ఎవరికీ సమా చారం ఇవ్వటం లేదని ఆయన అన్నారు. దీంతో రైతులకు సరియైన సమాచారం లేక తమను అడుగుతున్నారని ఇక్కడ పశువైద్య సిబ్బంది పై ఆయన ధ్వజ మెత్తారు.ఇక్కడ పశువైద్య శిబిరాలు నిర్వహణ సక్రమంగా లేని విషయాన్ని జిల్లా వున్నతాదికారుల దృష్టికి తీసుకు వెళ్ల నున్నట్లు ఆయన వివరించారు. ప్రజాప్రతినిధులు పూర్తిగా సమాచారం లేకుండా,ఎప్పుడు ఏంచేస్తున్నది ఎవ్వరికీ తెలియకుండా,అస్థ,వ్యస్థంగా చేస్తున్నారని ధ్వజమెత్తారు. డాక్టర్ల లేక పోవటం వల్ల సిబ్బంది ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. ఈ విషయాన్ని జేడి ఏ దృష్టికి ఈ విషయాన్ని ఈదినం తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.అంతే కాకుండా రాష్ట్ర స్తాయి అధికారుల దృష్టికి తీసు కెల్లనున్నట్లు ఎంపీపీ సురేష్ ముఖర్జీ వెల్లడించారు.

ఐసిడిఎస్ ను క్రమబద్ధీకరించి గాడ్ డ్యూటీ అమలు చేయాలి

విశాలాంధ్ర-గజపతినగరం : అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం అఖిల భారత కమిటీ పిలుపుమేరకు ఐసిడిఎస్ క్రమబద్ధీకరణ గ్రాడ్యుటి. కనీస వేతనం 26 వేలకు అమలు తదితర సమస్యలపై గజపతినగరం ఎస్ ఎల్ వలస సెక్టార్ మీటింగ్ ఎస్ లింగాలవలసలో గురువారం జరిగిన సందర్భముగా వ్యక్తిగత దరఖాస్తులు రాసి పోస్టల్ ద్వారా రాష్ట్రపతికి పంపిస్తున్నామని యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎం సుభాషిని మాట్లాడుతూ బాలింతలకు గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని లక్ష్యంతో ఐసిడిఎస్ ను ఏర్పాటు అయ్యి 50 ఏళ్లు పూర్తయిందని ఈ నేపథ్యంలో ఐసిడిఎస్ ను క్రమబద్ధీకరించి బడ్జెట్లో కేటాయింపులు పెంచాలన్నారు. దశాబ్దాలుగా సర్వీస్ అందిస్తున్న వర్కర్లను నెలపర్లను కనీస వేతనం 26,000 అమలుతో పాటు సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం గ్రాడ్యుటి చెల్లించే విధంగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చర్యలు తీసు కావాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో బి పైడ్రాజు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 13 వరకు స్పర్శ కుష్టు వ్యాదిపై అవగాహన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా గురువారం నుండి నుండి ఫిబ్రవరి 13 వరకు స్పర్శ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.యస్, జీవన రాణి తెలిపారు ఈ మేరకు గురువారంజిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయములో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలసి అవగాహన పెంచుదాము అపోహలు తొలగిద్దాం' అనేనినాదంతో ముందుకు పోదాం అని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా తేదీ ఫిబ్రవరి 13 వరకు ఆశా కార్యకర్తలు,స్త్రీ ఆరోగ్యకార్యకర్తలు ద్వారా ఈ కార్యక్రమము పై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తామన్నారు ఈ కార్యక్రమములో జిల్లా కుష్టు, ఎయిడ్స్ నియం త్రణాధికారిడా, కె.రాణి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డా. ఆర్ అచ్చుత కుమారి, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారిడా ఎన్., సూర్యనారాయణ, జిల్లా మలేరియా అధికారి వై. మణి , జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి డా.ఎ. అర్చన, డెర్మటాలజీహెచ్ ఒ డి డా. అజయ్ కుమార్, డెమోచినతల్లి , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు దివిస్ స్టడీ మెటీరియల్

విశాలాంధ్ర-భోగాపురం: మండలంలోని పోలిపల్లి, మహారాజుపేట ఉన్నత పాఠశాలకు దివిస్ కంపెనీ యాజమాన్య సంస్థ ప తరగతి విద్యార్థులకు జిల్లా కామన్ ఎంట్రన్స్ బోర్డు రూపొందించిన స్టడీ మెటీరియల్ ను గురువారం అందజేశారు. పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 63మందికి ప్రధానోపాధ్యాయులు ఇందిర ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా మహారాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ ఆధ్వర్యంలో 48 విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. గతంలో అందించిన విధంగా ఈ సంవత్సరం కూడా దివిస్ వారు స్టడీ మెటీరియల్ అందించడం విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించడాని, ప్రతి సబ్జెక్టులో ఎక్కువ మార్కులు సాదించవచ్చునని పాఠశాల ఉపాధ్యాయులు తెలియజేశారు. దివిస్ కంపెనీ సీ.ఎస్ ఆర్ ప్రతినిధి ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు ఇంకా 40 రోజులు మాత్రమే సమయం ఉన్నందున ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రణాళిక ప్రకారం ఈ స్టడీ మెటీరియల్ అనుసరించి చదివినట్లయితే 100% ఉత్తమ ఫలితాలు సాధించ వచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ ను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్ కుమార్

విశాలాంధ్ర-తెర్లాం :మండలం లో గురువారం పోలింగ్ స్టేషన్ ను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్ కుమార్. తహసీల్దార్ తో పాటు స్థానిక ఎస్ ఐ సాగరబాబు, ఎం ఈ ఓ జే.తిర్దాదరావు ఈ పోలింగ్ కేంద్రం పరిశీలన కార్యక్రమం లో పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కోరుకున్న జాతిపిత..

విశాలాంధ్ర-చీపురుపల్లి : దేశంలో మతసామరస్యం వెలగాలని కోరుకొని మతోన్మాదులు చేతుల్లో బలైన మహాత్ముడు జాతిపిత గాంధీజీ అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ అన్నారు. గాంధీ 77వ వర్ధంతి సందర్భంగా చీపురుపల్లిలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ గురువారం నిర్వహించి సుమారు 60 మందికి పైగా రక్తదాతలు రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వతంత్ర అనంతరం భారతదేశంలో మత ఘర్షణలు ఆగాలని మతసామరస్యం వెలగాలని కోరుకొని మతోన్మాది అయిన గాడ్సే చేతిలో హత్యగావింపబడ్డ మహాత్ముడికి మనం ఎల్లప్పుడూ నివాళులు అర్పిస్తూనే ఉండాలని అన్నారు. దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన నాయకులలో గాంధీజీ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని అటువంటి గాంధీజీని ఆర్ఎస్ఎస్ ఉగ్రవాది నాదూరం గాడ్సే 1948 జనవరి 30వ తారీఖున అందరూ చూస్తుండగానే కాల్చి చంపారని తెలిపారు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడిన ఆర్ఎస్ఎస్ నేడు దేశభక్తి, దేశద్రోహులు అంటూ ప్రజల మధ్య చీలిక తెస్తుందని అసలైన దేశద్రోహులు, సంఘవిద్రోహు శక్తులు ఆర్ఎస్ఎస్ వారని దుయ్యబట్టారు. ప్రజలందరినీ ఏకం చేసి స్వాతంత్రోద్యమం నడపడంలో గాంధీజీ పోషించిన పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఇదే సందర్భంలో ఆపదలో ఉన్న వ్యక్తులకు మనం అందించే సాయం



రక్తదానమని అది ప్రాణదానంతో సమానమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మూడుసార్లు రక్తదాన శిబిరాలు జిల్లాలో అన్నిచోట్ల ఏర్పాటు చేస్తామని దానిలో భాగంగానే గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఈ రోజు ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో రక్తదానం చేసిన విద్యార్థులందరికీ ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా కమిటీ తరపున అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణాజి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ఎంతో ఉత్సాహంతో రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థి దశలోనే సాటివారికి సాయం చేయాలనే దృక్పథం విద్యార్థులకు కలగడం రేపటి మంచి భవిష్యత్తుకు పునాదులు అని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో మొత్తంగా 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు %జీ% రవి కుమార్ ,ఎం వెంకీ ,జిల్లా సహాయ కార్యదర్శి %జు% వంశీ , జిల్లా కమిటీ సభ్యులు రమణ, రూప మరియు నాయకులు మధు ,జగదీష్ ,నాని, తేజ, పవన్, సాయి, సూర్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా పాల్గొన్నారు.